సాక్షి
వనపర్తి
మంగళవారం । 4 । జూలై । 2023



సర్కారు బడికి డిమాండ్

ధరూర్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో నో అడ్మిషన్స్ బోర్డు పెట్టారు.

వివరాలు 8లో ▶



కార్మికులకు ఆరోగ్య కిట్లు

వనపర్తి పురపాలికలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్యకిట్ల పంపిణీకి చర్యలు చేపట్టారు.

వివరాలు 9లో ▶

గరిష్ఠం/కనిష్ఠం
36.9 /23.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీసు ప్రజావాణికి 15 అర్జీలు



వనపర్తి: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ రక్షిత కె.మూర్తి ఫిర్యాదుదారులతో అర్జీలు స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు సదరు అర్జీలను సిఫారసు చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి 15 అర్జీలు రాగా.. అందులో 10 భార్యాభర్తల గొడవకు సంబంధించినవి కాగా.. 2 పరస్పర గొడవలు, 3 భూ తగాదాల అర్జీలు ఉన్నాయి.

పేదోళ్ల గోడు పట్టించుకోని ప్రభుత్వం



వనపర్తి: పేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని గత ఎన్నికల్లో ఓట్లు దండుకున్న తెలంగాణ సర్కారు ఆ పథకాన్ని అటకెక్కించిందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. సోమవారం సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆర్డీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రజాసంఘాల నాయకులు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయంలో ప్రచారం ఎక్కువ చేసి ఆచరణలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించిందని విమర్శించారు. సీపీఎం పోరాట ఫలితంగా నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ హయాంలో జిల్లాకేంద్రంలోని పీర్లగుట్ట, మబ్బుగుట్ట తదితర ప్రాంతాల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలిచ్చి స్థలాలు చూపించలేదన్నారు. అమరచింతలో పది నెలలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి ప్లాట్లు చూపించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో చాలాచోట్ల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించినప్పటికీ పంపిణీలో పాలకులు నేటికీ నిర్లక్ష ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. పేదలకు ఇంటిస్థలం చూపించటంతో పాటు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండి జబ్బార్, పుట్టా ఆంజనేయులు, అమరచింత పుర వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మేకల ఆంజనేయులు, బాల్‌రెడ్డి, లక్ష్మి, మండ్ల రాజు, ఎస్ రాజు, పరమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

వనపర్తి: కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో గిట్టుబాటు కావటం లేదని సోమవారం మండలంలోని రాజపేట ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిపివేశారు. గత కొన్నిరోజులుగా సమస్యను ఉపాధ్యాయులకు విన్నవించినా మెస్‌చార్జీలు పెంచకపోవటంతో వంటలు చేయలేదని కార్మికులు చెప్పారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో ఉపాధ్యాయులు చర్చించి వంట చేసేందుకు ఇతరులను రమ్మని కోరినా ఎవరూ ముందుకు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

నిర్లక్ష్యం..!



గోపాల్‌పేట శివారులో నాసిరకంగా నిర్మించిన స్ట్రక్చర్ వద్ద వృథాగా పారుతున్న నీరు (ఫైల్)

పూర్తికాని కేఎల్‌ఐ డి-8 కాల్వ పనులు

- రూ.35 కోట్లతో 18 ఏళ్ల క్రితం ప్రారంభించిన వైనం
- 800 స్ట్రక్చర్లకుగాను కేవలం 37 మాత్రమే పూర్తి

వనపర్తి/గోపాల్‌పేట: సుమారు 23 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.35 కోట్ల అంచనాలతో రూపొందించిన కేఎల్‌ఐ డి-8 కాల్వ పనులపై 18 ఏళ్లుగా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతూనే ఉంది. ప్యాకేజీ-27లో భాగంగా కేఎల్‌ఐ డి-8 కాల్వ నిర్మాణం చేపట్టేందుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం ప్రధాన కాల్వను తవ్వి మిగిలిన పనులను స్థానిక సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించడంతో ఏళ్లు గడుస్తున్నా.. పూర్తి కావడం లేదు. గుడిపల్లి గట్టు నుంచి వచ్చే కాల్వకు తూడికుర్తి సమీపంలో 11 కిలోమీటర్ రాయి వద్ద మలుపు తీసుకొని 34 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ నిర్మాణంతో పాటు 7 మేజర్ కాల్వలు, 17 మైనర్ కాల్వలను తవ్వాల్సి ఉంది. ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్ ప్రధాన కాల్వ 32.4 కిలోమీటర్లు తవ్వి మిగతా 1.6 కిలోమీటర్ల మేర వదిలేశారు. మేజర్, మైనర్ కాల్వ పనులను స్థానిక కాంట్రాక్టర్లతో చేయించే ప్రయత్నం చేసినా.. నేటికీ 50 శాతం కూడా పూర్తికాలేదని ఇరిగేషన్ అధికారుల లెక్కలతో స్పష్టమవుతోంది. దీంతో ఏటా కాల్వలకు గండ్లుపడటం, పొలాల్లోకి నీరు చేరడం, సాగునీరు వృథాకావటం లాంటి నష్టాలతో పాటు నిర్దేశిత ఆయకట్టు కంటే మరో 25 వేల ఎకరాలకు సాగునీరందే అవకాశం లేకుండా పోతోంది. 7 మేజర్ కాల్వల్లో 4, 6 కాల్వల ఎర్త్ వర్క్ పూర్తి చేశారు. మిగతా 1, 2, 3, 5, 7 కాల్వల పనులు చేపట్టాల్సి ఉంది. మైనర్ కాల్వలు 17 నిర్మించాల్సి ఉండగా.. కేవలం అయిదు మాత్రమే తవ్వగా మిగతావి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాకలిపల్లి, గోపాల్‌పేట గ్రామాల శివార్లలో కాల్వకట్టలు తెగి నీరంతా పొలాల్లోకి వృథాగా పారుతుంది. ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఉన్నా అధికార పాలకవర్గం పట్టించుకోవటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పెండింగ్‌లోనే 763 స్ట్రక్చర్లు..

కేఎల్‌ఐ డి-8 కాల్వపై 800 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా.. 18 ఏళ్లలో కేవలం 37 మాత్రమే చేశారు. ఇంకా 763 నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనుల్లో సింగిల్‌లైన్ రోడ్‌వే బ్రిడ్జి, డబుల్ లైన్ రోడ్‌వే బ్రిడ్జితో పాటు, మేజర్, మైనర్ కాల్వలకు నీటిని విడుదల చేసే గేట్‌వాల్స్‌ను కాంక్రీట్‌తో చేయాల్సి ఉంది. ఏళ్లుగా పనులు పెండింగ్‌లో ఉండటంతో అధికారులు సదరు ఏజెన్సీ బిల్లులు సైతం పెండింగ్‌లో ఉంచడంతో ఎక్కడి ఆగిన పనులు అక్కడే ఉన్నాయి.

తాత్కాలిక గూనలు ఏర్పాటుచేసి..

స్ట్రక్చర్ల నిర్మాణం పూర్తిగాకపోవటంతో తాత్కాలికంగా గూనలు ఏర్పాటు చేసి రేవల్లి, గోపాల్‌పేట, పాన్‌గల్, కోడేరు మండలాల్లోని గ్రామాల రైతులకు సాగునీరందిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఎక్కడ గండిపడుతుందోనని అధికారులు, రైతులు భయం భయంతోనే కాలం నెట్టుకొస్తున్నారు. చేసిన పనులు నాసిరకంగా ఉండటంతో కొన్నిచోట్ల స్ట్రక్చర్‌తో పాటు పక్కన ఉన్న కట్టలు తెగి నీరు వృథా అవుతోంది.

వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేస్తాం..



పనులు దక్కించుకొని పూర్తి చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పెండింగ్ పనుల పూర్తికి కొత్త అంచనాలు రూపొందించి వెంటనే పనులు చేపట్టి వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.
– మధుసూదన్‌రావు, ఈఈ, ఇరిగేషన్‌శాఖ

కాంట్రాక్టర్‌కు 60-సి నోటీసులు..

ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తిచేయకపోవడాన్ని కారణంగా చూపిస్తూ.. ఇరిగేషన్ అధికారులు ఇటీవలే పనులు దక్కించుకున్న ఏజెన్సీ (కాంట్రాక్టర్)కి నోటీసులు జారీచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను పెండింగ్ పనులకు మారిన రేట్ల ప్రకారం కొత్త అంచనాలు రూపొందించేందుకు అధికారులు సమయాత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. పనులు పూర్తయితే కేఎల్‌ఐ డి-8 కాల్వతో రేవల్లి, పాన్‌గల్, గోపాల్‌పేట, కోడేరు మండలాల్లోని 50 వేల పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అధికారులు

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అధికారులు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని అర్జీదారులతో వినతులు స్వీకరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్న భోజన విరామ సమయం వరకు 93 అర్జీలు దాఖలైనట్లు గ్రీవెన్స్ సెల్ అధికారి శ్రీకాంత్‌రావు తెలిపారు. ఆయా శాఖల అధికారులతో అక్కడే మాట్లాడి ఫిర్యాదుల పరిష్కార మార్గాలను సూచించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తనను సంప్రదించాలని కోరారు. శనివారం జరిగిన గ్రూప్–4 పరీక్షలను సజావుగా నిర్వహించినందుకు గాను అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. అనంతరం రెడ్‌క్రాస్‌లో అత్యధిక చందాదారులను చేర్పించిన సీఈఓ శ్రావణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్‌ను శాలువాతో సన్మానించారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎరువులు, విత్తనాలు, పోడు పట్టాల పంపిణీ, పేదలకు ఇంటి స్థలాలు, గృహలక్ష్మి, హరితహారం, రెండో విడత గొర్రెల పంపిణీ, కులవృత్తులకు ఆర్థిక సాయం, సీఎమ్మార్ తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. 11 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు, కావాల్సిన మేర విత్తనాలు ఉన్నాయని, అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజల ముంగిట ఆర్టీసీ



మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో పరిధిలోని విలేజ్ బస్ ఆఫీసర్లు

- 'విలేజ్ బస్ ఆఫీసర్స్' నియామకానికి శ్రీకారం
- రీజియన్‌లో 282 మంది డ్రైవర్లు, కండక్టర్లకు వీబీఓలుగా బాధ్యతలు
- ఆర్టీసీ సేవలపై గ్రామాల్లో ప్రచారం



బావాయిపల్లిలో ఆర్టీసీ సేవలపై ప్రచారం చేస్తున్న వీబీఓ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ వినూత్నమైన కార్యక్రమాలతో సేవలను ప్రజలకు ముంగిట తీసుకొస్తోంది. ఇప్పటికే ఆర్టీసీలో ప్రారంభించిన లాజిస్టిక్ కార్గో సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ పండుగ పర్వదినాల్లో అదనపు బస్సు సర్వీసులు నడుపుతోంది. పెళ్లిలు, వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తోంది. ఇటీవలే టీ–9 టికెట్‌ను కూడా ప్రారంభించింది. తాజాగా గ్రామాల్లో కూడా ఆర్టీసీ సేవలు విస్తృతం చేసేందుకు సంస్థ 'విలేజ్ బస్ ఆఫీసర్లు' నియామకం చేపట్టింది. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులనే వీబీఓలుగా నియమించారు. మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని 10 డిపోల్లో 282 మంది విలేజ్ బస్ ఆఫీసర్ల నియామకాన్ని చేపట్టారు. వీరు తమకు కేటాయించిన గ్రామాల్లో ఆర్టీసీ సేవలపై ప్రచారం చేస్తారు. వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రతి 15 రోజులకోసారి సమావేశాలు నిర్వహించి ఆర్టీసీ సేవల గురించి వివరిస్తారు. బస్సుల రాకపోకలు, ఆర్టీసీ దూర ప్రాంతాల సర్వీసులపై అందించే రాయితీలు, శుభకార్యాలు, విహార యాత్రలు తీసుకెళ్లేందుకు చెల్లించాల్సిన అద్దెల గురించి వివరిస్తారు. విద్యార్థులకు అందిస్తున్న బస్ పాస్‌లు, దివ్యాంగులకు ఇచ్చే రాయితీలపై అవగాహన కల్పిస్తారు. ఇప్పటికే కొందరు విలేజ్ బస్ ఆఫీసర్లు తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.

డిపోల వారీగా విలేజ్ బస్ ఆఫీసర్లు

డిపో	విలేజ్ బస్ ఆఫీసర్లు
నాగర్‌కర్నూల్	64
అచ్చంపేట	60
గద్వాల	49
కల్వకుర్తి	24
మహబూబ్‌నగర్	23
నారాయణపేట	17
షాద్‌నగర్	16
వనపర్తి	15
కొల్లాపూర్	10
కోస్గి	04

గ్రామీణులకు చేరువగా ఆర్టీసీ సేవలు



గ్రామీణ ప్రాంత ఆర్టీసీ సేవలను చేరువ చేయడానికి విలేజ్ బస్ ఆఫీసర్లను నియామకం చేపట్టాం. గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్, రెవెన్యూ ఆఫీసర్లు తరహాలో విలేజ్ బస్ ఆఫీసర్లు కూడా తమవంతు సేవలు అందిస్తారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో విలేజ్ బస్ ఆఫీసర్ల పేరు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే వీబీఓలు గ్రామాల్లో ఆర్టీసీ సేవలపై ప్రచారం కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రజలు వీబీఓ సేవలను ఉపయోగించుకోవాలి. – శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

దళిత విద్యార్థుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తిటౌన్: దళితబస్తీ పిల్లలు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని.. జిల్లాకేంద్రంలోని పురాతన దళితవాడ పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని దళితవాడ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మానసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని, జెడ్పీలో నిధులు అరకొరగా ఉన్నా.. విద్య, వైద్యానికే అధికంగా వెచ్చించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. చదువు, విజ్ఞానానికి పేదరికం అడ్డుకాదని.. తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. స్వయం ఉపాధి రంగంలో రాణించేందుకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందని.. నిరక్షరాస్యత కారణంగా వినియోగించుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకున్న యువత బ్యాంకుల ద్వారా రుణాలు పొంది స్వయంగా ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ.. జిల్లాలో విద్యారంగంలో నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పది ఫలితాల్లో దళితవాడ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని, మున్ముందు ఇదే ఒరవడిని కొనసాగించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా. మురళీధర్ మాట్లాడుతూ.. దళితవాడ పాఠశాల అభివృద్ధికి ఎన్ని లక్షలైనా ఖర్చు చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అనంతరం పాఠశాలకు తాగునీటిని సమకూర్చిన జెడ్పీ చైర్మన్, మురళీధర్‌ను డీఈఓ, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, గణేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు సత్తార్, సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, నాయకులు శరవంద, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రవాణా చార్జీలు చెల్లించాలి

వనపర్తి: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ దుకాణ రవాణా చార్జీలను వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, ఉపాధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. సోమవారం డిమాండ్ల వినతిపత్రాన్ని సీఐటీయూ నాయకుడు రాజుతో కలిసి డీడబ్ల్యూఓ రాం మహేశ్వర్‌రెడ్డికి అందజేసి మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని, అంగన్‌వాడి ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పింఛన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రతతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్లరాజు, నాయకురాలు జ్యోతి, రమేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

ఇన్‌చార్జ్ జిల్లా విద్యాధికారి గోవిందరాజులు



బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ఇన్‌చార్జ్ జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, ఇంగ్లీష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాల, దొంతికుంటతండా స్టేజీ దగ్గర ఉన్న మోడల్ పాఠశాలను ఎంఈఓ ఉషారాణితో కలిసి తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి పాఠశాలల్లోని సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించాలంటే ముందునుంచే ప్రణాళిక సిద్ధం చేసుకొని అందుకు అనుగుణంగా చదివించాలని చెప్పారు. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సూచనలు చేయాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ఉండాలని ఆదేశించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు – మన బడి పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రత్యేక అధికారులు లలిత, వాణికుమారి, సీఆర్పీ వెంకటేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

అమరచింత: సంక్షేమ పథకాల అమలులో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని మస్తీపురం గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొత్తగా ఏర్పడిన గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమం ప్రవేశపెట్టి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామంలో చర్చించుకొని వాటిని సాధించుకొనే వేదికగా మారిందన్నారు. పల్లెప్రగతి నిధులతో రహదారుల శుభ్రత, తాగునీటి సరఫరా, ప్రకృతివనాల ఏర్పాట్లు తదితర పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌సింగ్, తహసీల్దార్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



సాయిచంద్ తండ్రి వెంకట్రాములతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

గుండెపోటుతో మృతిచెందిన రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ సాయిచంద్ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలోని సాయిచంద్ ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తండ్రి వెంకట్రాములును కలిసి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు రమేష్ ముదిరాజ్, రాజేందర్‌సింగ్, నాగభూషణంగౌడ్, రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సాయివ్రతంలో పాల్గొన్న భక్తులు



గురుపౌర్ణమి మహోత్సవం

పెబ్బేరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబా విగ్రహానికి అభిషేకం, అలంకరణ, గణపతి, మన్యుసూక్త హోమం, సామూహిక సాయి వ్రతం తదితర ప్రత్యేక పూజలు కొనసాగాయి. అనంతరం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేయగా.. నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


రాకేష్‌ (ఫైల్‌)

మాగనూర్‌: విద్యుత్‌ షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. మాగనూర్‌ ఎస్‌ఐ మల్లేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నేరడగం గ్రామానికి చెందిన రాకేష్‌గౌడ్‌(22) తమ వ్యవసాయ పొలం వద్ద పంటకు నీరు పెట్టేందుకు సోమవారం తెల్లవారుజామున వెళ్లాడు. మోటారు స్విచ్‌ వేసే సమయంలో స్టార్టర్‌ బాక్స్‌కు ఎర్తింగ్‌ వచ్చి కరెంట్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి రాకపోవడం, ఫోన్‌ఎత్తకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూశారు. విద్యుత్‌షాక్‌తో చేతి వేళ్లు, ఎడమ కాలికి కాలిన గాయాలతో రాకేష్‌ మృతిచెంది పడి ఉండడాన్ని గమనించారు. మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని తెలిపారు. కాగా రాకేష్‌ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు వివరించారు.

పోతేపల్లిలో..


అల్లాజీ (ఫైల్‌)

వెల్దండ: మండల పరిధిలోని పోతేపల్లికి చెందిన ఉడత అల్లాజీ(38) సోమవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలోని వాటర్‌ప్లాంట్‌ వద్ద విద్యుత్‌షాక్‌ గురై మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వాటర్‌ ప్లాంట్‌ వద్ద నీటిని నింపుకొని వస్తానని ఆటోతో అల్లాజీ పొలం వద్దకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ఫోన్‌చేశారు. కానీ అతడు లిఫ్ట్‌ చేయలేదు. దీంతో ఆమె ప్లాంట్‌ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే విద్యుత్‌షాక్‌తో అల్లాజీ పడిఉన్నాడు. ఎంతపిలిచినా మాట్లాడకపోవడంతో పక్క పొలాల రైతులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. అల్లాజీకి భార్య మంజులతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్‌ ఢీకొని వ్యక్తి మృతి


నవీన్‌ (ఫైల్‌)

గోపాల్‌పేట: ట్రాక్టర్‌ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అనంతపురంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు... అనంతపురం గ్రామానికి చెందిన కడారి బాలయ్య, బాలమ్మ కుమారుడు కడారి నవీన్‌(35) భార్య శారదతో కలిసి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమ, మంగళవారాల్లో పెద్దమ్మ పండుగ కోసం భార్యాపిల్లలతో సోమవారం మధ్యాహ్నం గ్రామానికి వచ్చాడు. ఇంటి వద్ద తాగేందుకు మంచినీళ్లు లేకపోవడంతో పెద్ద వాటర్‌బాటిల్‌ తీసుకుని ఏదుల గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. నీళ్లు తీసుకుని తిరిగి వస్తుండగా, ఏదుల దాటి అనంతపురం రోడ్డుకు వచ్చిన తర్వాత ట్రాక్టర్‌ తగిలి కిందపడిపోయాడు. అతనిపై నుంచి ట్రాక్టర్‌ వెళ్లింది. దీంతో తల పగిలి అక్కడికక్కడే మరణించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..

జడ్చర్ల టౌన్‌: రోడ్డు ప్రమాదానికి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణానికి చెందిన ముంతాజ్‌ అలీ(52) ఆదివారం సాయంత్రం కూరగాయల కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా శాంతినగర్‌ సాయిబాబా టెంపుల్‌ సమీపంలో అతివేగంతో వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఘటనలో అలీ తలకు తీవ్రగాయం కావటంతో స్థానికులు పట్టణంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున అలీ మృతిచెందారు. ఘటనపై అతడి కుమారుడు మైబుల్‌పాష ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

అటవీ మార్గంలో నిదానంగా వెళ్లాలి

- వన్యప్రాణులకు హాని కలిగితే చర్యలు

మన్ననూర్‌: శ్రీశైలం–హైదరాబాద్‌ ప్రధాన రహదారిలో రాకపోకలు చేసే వారు తమ వాహనాలను పరిమిత వేగంతో నడపాలని డీఎఫ్‌ఓ రోహిత్‌ రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సుమారు 40ఏళ్ల పాటు జీవించే 16 అడుగుల పొడవైన ఓ రాక్‌ పైథాన్‌ (పాము) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని తెలిపారు. ఈ సీజన్‌లో వన్య ప్రాణులు పురుడు పోసుకునే (జత కట్టే) సమయమని, నూతన ఉత్సాహంతో ఉంటాయని తెలిపారు. అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా వచ్చే అవకాశం ఉంటుందని, వాహనదారులు నెమ్మదిగా, తప్పుకుని ముందుకుసాగాలని సూచించారు. ఎలాంటి సంఘటన జరిగినా వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సర్కారు బడికి డిమాండ్‌


ధరూరు ఉన్నత పాఠశాల


తరగతి గదిలో విద్యార్థులు

- ధరూరు ఉన్నత పాఠశాలలో 'నో అడ్మిషన్స్‌' బోర్డు పెట్టిన హెడ్మాస్టర్‌
- ఒక్కో తరగతిలో 200 మంది విద్యార్థులు
- 1,107 దాటిన విద్యార్థుల సంఖ్య

ధరూరు: ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కొన్నేళ్లుగా అత్యధికంగా విద్యార్థులు చదువుకోవడానికి అడ్మిషన్స్‌ పొందుతున్న పాఠశాల ఏదైనా ఉందా అంటే అది మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మాత్రమేనని చెప్పొచ్చు. పదేళ్ల వెనక్కి చూసినా ఉన్నత పాఠశాల పేరే వినిపిస్తోంది. వినిపించడం మాట అటుంచితే విద్యాశాఖ అధికారుల గణాంకాలే చెబుతున్నాయి. ఇటీవల కాలంలో మండలంఓల విద్యనభ్యసించే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగింది. కారణం చుట్టూ గద్వాల – రాయచూరు ప్రధాన రోడ్డులోనే పాఠశాల ఉండటం. ఏ గ్రామానికి వెళ్లాలన్నా రవాణా సౌకర్యం కలిగి ఉండటం. ఎంత రాత్రైనా గ్రామానికి చేరకోవడానికి వీలుగా ఉండటమే.

■ ఒక్కో తరగతిలో 200 మంది విద్యార్థులు

పాఠశాలలో ఒక్కో తరగతిలో దాదాపు 200 మంది విద్యార్థులకు పైగా ఉంటున్నారు. రెండు, మూడు సెక్షన్లు చేసినా ఒక్కో తరగతిలో 75 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 9వ తరగతిలోనే 300 మంది విద్యార్థులు ఉన్నారు. దీనికి తోటు ఇంగ్లిష్‌ మీడియం కూడా తోడవ్వడంతో పాఠశాలలో గదులు, ఉపాధ్యాయుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చదువు బాగుండటం.. అలాగే హాస్టల్‌ వసతి ఉండటంతో విద్యార్థులను ఈ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపిస్తున్నారు. విద్యార్థులందరికీ సరిపడా గదులు, బెంచీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఇలా..

తరగతి	మీడియం	
	తెలుగు	ఇంగ్లిష్‌
6వ	223	64
7వ	220	65
8వ	230	75
9వ	300	85
10వ	180	73





పెరిగిన ప్రవేశాలు

పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గతేడాది వరకు వెయ్యి మంది విద్యార్థులు చదువుకునేవారు. ప్రస్తుతం 1,107 దాటిపోయింది. దీంతో విద్యార్థులకు సరిపడా గదులు అందుబాటులో లేకపోవడంతో చేసేదేమి లేక ఉపాధ్యాయులు ఏకంగా 'నో అడ్మిషన్స్‌' బోర్డు పెట్టేశారు. రెండు, మూడు రోజులుగా పాఠశాలలో చేరేందుకు వస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితుల కారణంగా తాము ఏమి చేయలేకపోతున్నామని పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌ రెడ్డి తెలిపారు.

అడ్మిషన్లు ఎక్కువగా వస్తున్నాయి



పాఠశాలలో కొన్నేళ్లుగా గదుల సమస్య ఉంది. దానికి తోడు ఉపాధ్యాయుల కొరత. గతేడాది వెయ్యి మంది విద్యార్థులకు చదువు చెప్పాం. ఈ సారి సంఖ్య 1,100 దాటిపోయింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం, గదుల ఏర్పాటు ఉంటేనే తప్ప మేమేమి చేయలేకపోతున్నాము. రెండు రోజులుగా కొత్తగా వచ్చి చేరే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఎవరికీ ఏమి చెప్పాలో తెలియక ప్రస్తుతం నో అడ్మిషన్స్‌ పెట్టక తప్పలేదు.
– ప్రతాప్‌రెడ్డి, జీహెచ్‌ఎం, ఉన్నత పాఠశాల ధరూరు

చదువుపై చైతన్యమయ్యారు



మండల కేంద్రంలో చదువుకునేందుకు ఆయా గ్రామాల నుంచి విద్యార్థులు ఎక్కువగా వస్తారు. చుట్టూ పల్లెలు ఎక్కువగా ఉన్నాయి. అవసరమైతే ఇతర పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను తీసుకువచ్చి బోధన చేయించాలి. చదువుపై ఇటీవల కాలంలో ప్రజలు చైతన్యమయ్యారు.
– కర్రెన్న, మాజీ జెడ్పీటీసీ, ధరూరు

బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలి



స్థానిక ఉన్నత పాఠశాలలో చదివిన వారు ఎంతో మంది ప్రయోజకులయ్యారు. చదువుతో పాటు పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం, పచ్చని చెట్లు, విశాలమైన ప్లే గ్రౌండ్‌ అన్ని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుంటాయి. వచ్చే విద్యా సంవత్సరమైనా బాలిక పాఠశాలను ప్రత్యేకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. – పద్మమ్మ, సర్పంచ్‌, ధరూరు

■ బాలికల పాఠశాల ఏర్పాటుకు డిమాండ్‌

మండలంలో ఏ పాఠశాలలో లేనంతగా చదువుకునేందుకు వస్తుంటారు. ఏటేటా పెరుగుతున్న ప్రవేశాలను దృష్టిలో ఉంచుకుని బాలికల హైస్కూల్‌ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విశాలమైన స్థలం కూడా ఉండటం ఇక్కడ బాలికలకు ప్రత్యేకంగా గదులు నిర్మించి తరగతులు బోధించేందుకు అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మోసపూరిత పాలనను అంతమొందించాలి


మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల: సీఎం కేసీఆర్‌ సాగిస్తున్న అబద్ధపు, మోసపూరిత పాలనను అంతమొందించాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. మండల పరిధిలోని అనంతపురం, బసల్‌చెర్వు, జంగంపల్లి, వీరాపురం, పూటాన్‌పల్లి గ్రామాల్లో బీజేపీ జెండా పండుగ సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం డీకే అరుణ మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు అహంకారం పెరిగిందని, ప్రజలంటే లెక్కలేకుండా పోయిందన్నారు. కేసీఆర్‌ నీచ రాజకీయాలను ప్రజలు నమ్మడంలేదన్నారు. దేశంలోనే రూ.5 లక్షల కోట్ల అప్పులున్న రాష్ట్రంగా తెలంగాణను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ధ్వజమెత్తారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌లకు తెలియకుండా ఖర్చు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్‌తో ప్రజలు విసిగిపోయారని, ఈసారి కేసీఆర్‌ పిట్టకథలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన అందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసి దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్‌ రామాంజనేయులు, పార్టీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండల వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బ్రహ్మేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

మహబూబ్‌నగర్‌ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్‌లలో పని చేస్తున్న 12మంది ఎస్‌ఐలను బదిలీలు చేస్తూ జోగుళాంబ జోన్‌ డీఐజీ ఎల్‌ఎస్‌ చౌహాన్‌ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 15 రోజుల వ్యవధిలో మూడు దశలలో ఎస్‌ఐల బదిలీలు కావడం విశేషం. మొత్తం ఉమ్మడి జిల్లాలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో బదిలీలు చేయనున్నారు. మిగిలిపోయిన స్టేషన్‌లలో కూడా ఈ వారం వ్యవధిలో ఎస్‌ఐలకు స్థానచలనం కలగనుంది.

ఎస్‌ఐ	ప్రస్తుతం	బదిలీస్థానం
కె. శ్రీనివాసులు	శాంతినగర్‌	మూసాపేట
పి.విజయ్‌భాస్కర్‌	మూసాపేట	వీఆర్‌, మహబూబ్‌నగర్‌
ఆర్‌.శేఖర్‌	మల్దకల్‌	చిన్నచింతకుంట
వి.మోహన్‌బాబు	చిన్నచింతకుంట	వీఆర్‌, మహబూబ్‌నగర్‌
రిషికేష్‌	వీఆర్‌,మహబూబ్‌నగర్‌	వీఆర్‌, గద్వాల
డి.సురేష్‌	వీఆర్‌, నారాయణపేట	మహ్మదాబాద్‌
ఎస్‌.సైదయ్య	మహమ్మదాబాద్‌	వీఆర్‌, మహబూబ్‌నగర్‌
పి.అశోక్‌బాబు	డీసీఆర్‌బీ వనపర్తి	ఇటిక్యాల
ఎంఏ ఖదీర్‌	వీఆర్‌, నారాయణపేట	వీఆర్‌, గద్వాల అటాచ్‌ రాజోళి పీఎస్‌
ఏ.నాగరాజు	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్‌	వీఆర్‌, నారాయణపేట
బి.కృష్ణయ్య	సీసీఎస్‌, మహబూబ్‌నగర్‌	వీఆర్‌, నారాయణపేట
కొండూరు రాము	డీసీఆర్‌బీ, వనపర్తి	మానవపాడు

అగ్నిప్రమాదంలో సామిల్‌ దగ్ధం


దగ్ధమవుతున్న సామిల్‌

కొల్లాపూర్‌: అగ్నిప్రమాదంలో సామిల్‌ దగ్ధమైన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చుక్కాయిపల్లి కాలనీలోని ఖాజా సామిల్‌లో ఆదివారం అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. రాత్రి ఒంటిగంట సమయంలో మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్‌చేశారు. యజమాని ఫయాజ్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్‌ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో భారీ కలపదుంగలతో పాటు, కోత మిషన్‌ కాలిపోయింది. ఘటనలో రూ. 20 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ఫయాజ్‌ తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా లేక షాట్‌సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయా అనేది తెలియలేదు. ఘటనపై ఫయాజ్‌ సోమవారం పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

చోరీకి విఫలయత్నం

గద్వాల క్రైం: గద్వాల పట్టణంలోని రాంనగర్‌ కాలనీలోని రామాలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీకి విఫలయత్నం జరిగింది. కానుకల హుండీలోని నగదును అపహరించేందుకు కొందరు దుండగులు ప్రయత్నం చేశారు. ధ్వంసం చేసే క్రమంలో పెద్ద శబ్దం రావడంతో కాలనీవాసులు తేరుకుని, నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

8న జల్సే ఫైజానే కాజ్మియా ధార్మికసభ

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లాలోని భూత్పూర్‌ మండల కేంద్రం జామీయా మసీద్‌ ఆవరణలో ఈనెల 8న రాత్రి 8.30 గంటలకు ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు బజ్మే అంజుమనే ఖాద్రియా కాజ్మియా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూత్పూర్‌ సిల్‌సిలాయే కాజ్మియా ఖాద్రీయా ఆధ్వర్యంలో జరిగే సభలో ముఖ్యవక్తగా హైదరాబాద్‌కు చెందిన షహెజాదే గౌసే ఆజం హజ్రత్‌ అల్లమా సయ్యద్‌షా ఆలే ముస్తఫా ఖాద్రీ, కొత్తకోటకు చెందిన మౌలానా ఆబిద్‌ హుస్సేన్‌ ఖాద్రీ, మౌలానా ఇఫ్తెకార్‌ అహ్మద్‌ ఖాద్రీ, మహ్మద్‌ మహమూద్‌ హుస్సేన్‌ పాల్గొని సందేశాలు ఇస్తారని తెలిపారు. అంతకుముందు రాత్రి 8 గంటలకు మోటార్‌సైకిల్‌ ర్యాలీ నిర్వహిస్తామని, ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో మహ్మద్‌ అసద్‌ ఖాద్రీ, రఫీవుల్లా ఖాద్రీ, అక్బర్‌ ఖాద్రీ, రహీం ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరు పరిశీలన


అక్కారం గ్రామపంచాయతీని పరిశీలిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు

అచ్చంపేట రూరల్‌: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు పరిశీలించారు. మండలంలోని అక్కారం, ఘనపూర్‌ గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయా గ్రామ పంచాయతీలు, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పథకాలు అమలవుతున్న తీరును లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. పల్లెప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పథకాలను జియో ట్యాగింగ్‌ రూపంలో ఫొటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటయ్య, అక్కారం సర్పంచ్‌ కృష్ణవేణి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పీఆర్‌ ఏఈ సందీప్‌, ఏపీఓ పర్వతాలు, మహేందర్‌, లలిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడిచేసిన యువకులపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి విధులకు ఆటంకం కల్గించడంతో పాటు పోలీసులపై దాడి చేసిన ఉప్పునుంతలకు చెందిన యువకులు మేకల మల్లేష్‌, పాత్కుల స్వామి, సల్కూటి రాజిరెడ్డిలపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ముగ్గురు యువకులు అర్ధరాత్రి అంబేద్కర్‌ చౌరస్తా వద్ద తమ బైక్‌లను ట్రాక్టర్‌కు అడ్డుగా పెట్టి అల్లరి చేస్తున్నారనే సమాచారం మేరకు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న హెడ్‌ కానిస్టేబుల్‌ ఎంకోజీ, కానిస్టేబుల్‌ మల్లేష్‌, హోంగార్డు శంకర్‌ అక్కడి వెళ్లారు. సదరు యువకులు పోలీసులను దూషించడంతో పాటు దాడిచేసి గాయపర్చారు. దీంతో యువకులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కంప్రెషర్‌ ట్రాక్టర్‌ పేలుడుపై విచారణ


విచారణ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్‌ బృందం

అమ్రాబాద్‌: నాగర్‌కర్నూల్‌ జిల్లా పదర మండలం నక్కలగుట్ట వద్ద ఆదివారం జరిగిన కంప్రెషర్‌ ట్రాక్టర్‌ పేలి ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం సాయంత్రం జిల్లా బాంబ్‌స్క్వాడ్‌, డాగ్‌ స్క్వాడ్‌ ఎఎస్‌ఐ బృందం ఆధ్వర్యంలో ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. పేలుడు ఎలా సంభవించిందనే విషయంపై విచారణ జరిపినట్లు సమాచారం.

పాత స్టాక్‌ విత్తనాలు అంటగట్టారు

- మొలకెత్తక ఆందోళన చెందుతున్న రైతులు
- సగం బస్తాలను రైతులకు తిరిగి ఇచ్చిన సంస్థ
- పాత నిల్వ విత్తన సరఫరాపై నిర్లక్ష్యం ఎవరిది?
- అష్టకష్టాలు పడుతున్న పూసల్‌పహాడ్‌ వాసులు


మొలకెత్తని విత్తనాలను తిరిగి గోడౌన్‌లోకి తరలిస్తున్న హమాలీలు

మహబూబ్‌నగర్‌(వ్యవసాయం): తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో రైతులకు ఇస్తున్న విత్తనాల్లో ఎక్కడ నిర్లక్ష్యం జరిగిందో తెలియదు కాని ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా మరికల్‌ మండలంలోని పూసల్‌పహాడ్‌కి చెందిన రైతులకు మాత్రం ఈ విత్తనాలు శాపంగా మారాయి. వర్షాలు పడుతున్న సమయంలో అరుద్ర కార్తె ముగుస్తున్న తరుణంలో ఎంతో ఉత్సాహంగా ఎంటీయూ –1010 రకం వరి విత్తనాలను మండె కట్టిన రైతులకు తీరా అవి మొలకెత్తలేదు. దీంతో వారు లబోదిబోమంటున్నారు. పూసల్‌పహాడ్‌కు చెందిన రైతులు దాదాపు 200 బస్తాల వరకు వరి విత్తనాలను కొనుగోలు చేశారు. మహబూబ్‌నగర్‌లోని స్టోర్‌ నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తమ పొలాల్లో మండె కట్టారు. అయితే మూడు రోజులు కావొస్తున్నా.. విత్తనాలు మొలకెత్తకపోయేసరికి రైతులు ఆందోళనకు గురయ్యారు. ఒక్కో రైతు 10 నుంచి 20 బస్తాల వరకు, ఒక్కో బస్తాకు(25 కిలోలు) రూ.883 చెల్లించి తీసుకెళ్లారు. వరి విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఈ సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. కొంతమంది సీడ్‌ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించినట్లు తెలిసింది.

■ ఇదిలా ఉండగా పూసల్‌పహాడ్‌కి చెందిన రైతులు తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌ను కలుస్తామని హెచ్చరించడంతో విత్తన సంస్థ అధికారులు దిగొచ్చారు. రైతులకు జరిగిన అన్యాయంపై స్పందిస్తూ.. పరిహారంగా సగం విత్తన బస్తాలతో పాటు ట్రాన్స్‌పోర్ట్‌ చార్జీలను కూడా చెల్లించేందుకు సిద్ధమయ్యారు. రైతులు తీసుకెళ్లిన వరి విత్తనాలను ఈ నేపథ్యంలో రెండు బొలెరో వాహనాల్లో పాత స్టాక్‌ నిలువ ఉన్న వరి విత్తన బస్తాలను తిరిగి విత్తన సంస్థ గోడౌన్‌కు సోమవారం తీసుకొచ్చారు. ఇక్కడ స్టోర్‌ ఇన్‌చార్జి శేఖర్‌ ఆధ్వర్యంలో రైతులను సముదాయించి 10 బస్తాలు తీసుకున్న రైతుకు 5 బస్తాలు, 6 బస్తాలు తీసుకున్న వారికి 3 బస్తాలు ఇచ్చేశారు. ఒక పక్క ఉష్ణోగ్రతల ప్రభావం, మరోపక్క రైతులకు అవగాహన లేక.. ఇంకోపక్క ఆరుద్ర కార్తె దాటుతున్న సమయంలో విత్తనాలు చల్లితే మొలకెత్తుతాయా..? రైతులకు ఇచ్చిన విత్తనాలు కాల పరిమితి 9 నెలలు ఉంటుందని..? వరి విత్తనాలు మండె కట్టకపోవడంతోనే మొలకెత్తలేదని.. ఇది ముమ్మాటికి రైతులదే తప్పేనని సమాధానం ఇచ్చారు. గుడ్డిగా రైతులకు విత్తనాలు అమ్మిన సంస్థ సిబ్బంది పనితీరుపై రైతు సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్‌ మేనేజర్‌ రాజీవ్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నల్లి పురుగు కొరికేసింది



మహబూబ్‌నగర్‌లోని విత్తనాభివృద్ధి సంస్థలో ఎంటీయూ –1010 రకం వరి విత్తనాలు కొనుగోలు చేసి తమ పొలంలో మూడు బస్తాలు విప్పి మండె కట్టగా.. మూడు రోజులైనా మొలక రాలేదు. నల్లి పురుగు గింజను కొరికేసింది. దీంతో మొలకరాలేదు. అరుద్ర కార్తెలో వరి తుకం పోస్తే దిగుబడి కూడా బాగా వస్తుంది. ఇక్కడి విత్తనాలు మొలకలు రాకపోవడంతో కార్తె సమయం దాటిపోతుంది. ఆరు బస్తాలు కొంటే మూడు బస్తాలే తిరిగి ఇచ్చింద్రు. మొలకెత్తని విత్తనాలు ఇచ్చి రైతులకు నష్టం కలిగించారు. – మొగులయ్య, రైతు, పూసల్‌పహాడ్‌, మరికల్‌ మండలం

మొలక రాలేదు



ఒక్కో బస్తాకు రూ.883లు చెల్లించి 22 బస్తాలు తీసుకెళ్లి 10 బస్తాలు విప్పి పొలంలో చల్లితే మొలకలు రాలేదు. ఇప్పుడు రెండు బస్తాలు తగ్గించి 8 బస్తాలు తిరిగి ఇచ్చారు. ప్రతి ఏటా ఇక్కడికి వచ్చే విత్తనాలు కొంటాం. ఎప్పుడు ఇలా జరగలేదు. రెండేళ్ల కిందట నిల్వ ఉంచిన స్టాక్‌ ఇవ్వడంతో ఆ విత్తనాలకు పురుగు సోకింది. పోయిన దినం రాదు.. కార్తె కూడా దాటిపోతుంది. రైతులకు తీవ్ర నష్టం జరిగింది. – శేఖర్‌రెడ్డి, రైతు, పూసల్‌పహాడ్‌ గ్రామం